# బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

## ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్ సత్యనారాయణ

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 6: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని బల్దియా చైర్మన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో శుక్రవారం ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా, ఎవ్వరూ ఊహించని విధంగా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. కేసీఆర్ కిట్, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు బంధు, రైతు బీమా, దివ్యాంగులకు అత్యధిక పెన్షన్లు, గ్రామాల అభివృద్ధికి ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు, వైకుంఠధామాలు, కంపోస్టు షెడ్లు, విలేజ్ పార్కులు, మంకీ ఫుడ్‌కోర్టులు, హరితహారం, గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, క్రీడాకారులకు కిట్ల పంపిణీ, సబ్సిడీపై ధాన్యం కల్లాలు, కంటి వెలుగు, మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు తదితర ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ నాయకత్వంలో ఎల్లారెడ్డి పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. ఎల్లారెడ్డి పెద్దచెరువుకు ఇరువైపులా బ్రిడ్జి నిర్మాణం, పట్టణంలో అన్ని కుల సంఘాల భవనాలకు నిధులు, చిల్డ్రన్స్‌పార్క్, వంద పడకల దవాఖాన, డయాలసిస్ కేంద్రం, నూతన బస్టాండ్ నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రోడ్డు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత ఎమ్మెల్యే సురేందర్‌దే అన్నారు. జడ్పీటీసీ ఉషాగౌడ్, ఎల్లారెడ్డి, వెల్లుట్ల సొసైటీల చైర్మన్లు ఏగుల నర్సింహులు, పటేల్ సాయిలు, లక్ష్మాపూర్ సర్పంచ్ రవీందర్‌గౌడ్, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, ఎరుకల సాయిలు, లింగం, శ్రావణ్‌కుమార్, మామిడి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్ కుడుముల సత్యనారాయణ

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న సర్పంచ్ తిర్మల్‌రెడ్డి

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 6: ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కట్నం అందజేస్తున్నదని సర్పంచ్ తిర్మల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆరుగురికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన శుక్రవారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆడబిడ్డ పెండ్లి తల్లిదండ్రులకు ఆర్థిక భారం కావొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీలు..


ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు

నిజాంసాగర్, అక్టోబర్ 6: మండలంలోని వెల్గనూర్ గ్రామంలో 16 మందికి మంజూరైన గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలను సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ శుక్రవారం అందజేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకుడు ఆనంద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గంగాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా భవన నిర్మాణానికి శంకుస్థాపన


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు

డోంగ్లీ, అక్టోబర్6: మండల కేంద్రంలో క్రీడా భవన నిర్మాణానికి ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దీన్‌దయాళ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.ఐదు లక్షలను మంజూరు చేసిందని చెప్పారు. నిధుల మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఎంపీ బీబీ పాటిల్‌కు మండల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శంకర్ జాదవ్, యువకులు దామరంచ హన్మంత్, మధుకర్, ఏ.శంకర్, అకుల్‌వార్ రమేశ్, భద్రా పుండే, వీరన్న పట్నే తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిక


రాజాగౌడ్‌కు గులాబీ కండువా కప్పుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దుర్గారెడ్డి

నిజాంసాగర్, అక్టోబర్ 6: మండలంలోని మల్లూర్ గ్రామానికి చెందిన రాజాగౌడ్ గత 12 సంవత్సరాల పాటు దుబాయ్‌లో పని చేసి రెండు సంవత్సరాల కిందటే స్వగ్రామానికి వచ్చాడు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితుడై శుక్రవారం సీనియర్ నాయకుడు దుర్గారెడ్డి, వైస్ ఎంపీపీ మనోహర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో అచ్చంపేట సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, కళ్యాణి విఠల్‌రెడ్డి, నాయకులు మౌలానా, ఆనంద్‌కుమార్, యాటకారి నారాయణ, బ్రహ్మానందరెడ్డి, జయంత్‌రెడ్డి, లింగాగౌడ్, దుర్గేశ్, రాజం సాయిలు, జగన్, రాజం గంగారాం, కమ్మరి కత్త సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## పంటల పరిశీలన

గాంధారి, అక్టోబర్ 6: మండల కేంద్రంతోపాటు చద్మల్ గ్రామ శివారులో రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి పంటలను మండల వ్యవసాయాధికారి నరేశ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు పంటలపై పురుగు మందులను పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం పత్తికి రసం పీల్చే పురుగు ఆశించిందని, దాని నివారణకు తీసుకోవాల్సిన నివారణ చర్యలను వివరించారు. ఆయన వెంట పలువురు రైతులు ఉన్నారు.


పత్తిని పరిశీలిస్తున్న గాంధారి ఏవో నరేశ్

## పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 6: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దని, చెత్తాచెదారం పేరుకుపోతే ప్రజలు అనారోగ్యానికి గురవుతారని ఎంపీవో ప్రకాశ్ అన్నారు. మండలంలోని జంగమాయిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం వైకుంఠధామాన్ని, కంపోస్ట్‌షెడ్‌తోపాటు గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి సాయిరెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం


ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

మద్నూర్, అక్టోబర్ 6: మండలంలో పోలీసు ఉద్యోగాలు సాధించిన వారిని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బండివార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అభ్యర్థులు కష్టపడి ప్రభుత్వ కొలువు సాధించడం ఆనందంగా ఉన్నదన్నారు. ఉద్యోగాలు సాధించిన వారు మాట్లాడుతూ.. తమ చదువుకు సహకారం అందించిన విజయ్‌కుమార్‌తోపాటు తగిన సలహాలు అందజేసిన రిటైర్డ్ మిలిటరీ ఉద్యోగి బాలాజీకి కృతజ్ఞతలు తెలిపారు.

## పల్లెప్రగతి పనులపై
## ప్రత్యేక దృష్టి సారించాలి

గాంధారి, అక్టోబర్ 6: పల్లెప్రగతి పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని గాంధారి ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గౌరారం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కు సూచించారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు.

## మత్స్యకారులకు రాయితీపై చేప పిల్లల పంపిణీ


చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

గాంధారి, అక్టోబర్ 6: రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం రాయితీపై సరఫరా చేస్తున్న చేపపిల్లలను ఆయా గ్రామాల మత్స్యకారులకు మండల కేంద్రంలో శుక్రవారం పంపిణీ చేశారు. గాంధారి, పోతంగల్ కలాన్, గౌరారం, ముదెల్లి, సీతాయిపల్లి, గండివేట్, మేడిపల్లి చెరువుల్లో విడుదల చేయడానికి 35 నుంచి 40 ఎంఎం సైజు ఉన్న ఆరు లక్షల 24వేల చేపపిల్లలను మత్స్యకారులకు అందజేశారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న చేపపిల్లలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేపలను వేటాడి ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధాబలరాం, తహసీల్దార్ జానకి, నాయబ్ తహసీల్దార్ రవి, వైస్ ఎంపీపీ భజన్‌లాల్, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎఫ్‌డీవో శ్వేత, సురేశ్, మత్స్యకార సంఘం సభ్యులు నాయకయ్య, సత్యనారాయణ, దుర్గయ్య, సంగయ్య, పెంటయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

సదాశివనగర్, అక్టోబర్ 6: మండలంలోని ఉత్తునూర్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ నవీన్ ఇటీవల ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు సర్పంచ్ సాయవ్వా రాములు, ఉపసర్పంచ్ శివపాటిల్ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవీన్ కుటుంబ సభ్యులకు గ్రామ పంచాయతీ తరఫున ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంచందర్ రావు, వార్డు సభ్యులు గుడ్ల గంగారాం, నరేశ్ గౌడ్, వీరన్నరావు, మల్లయ్య, సుధాకర్, పంచాయతీ కార్యదర్శి దేవీసింగ్, జీపీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉత్తునూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు